క్లుప్తంగా

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం


సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. మాట తప్పి సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.9,412 కోట్ల భారం మోపడం దుర్మార్గమని వైఎస్సార్సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు మండిపడ్డారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచనని ప్రజలకు వాగ్దానం చేసి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కి న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరునెలల్లో రెండుసార్లు ట్రూఆప్ ఛార్జీల పేరిట పేదలపై భారం మోపారన్నారు. అలాగే సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తన మార్కు నయ వంచనతో తానిచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎడాపెడా కరెంట్ చార్జీలతో వీరబాదుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కూటమి ప్రభుత్వానికి త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఘనంగా పేదల గ్యార్మీ పండుగ


అన్నదానం చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని గౌసేఆజాం జెండాకట్ట ఆధ్వర్యంలో పేదల గ్యార్మీ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాకట్టకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. ఏటా గ్యార్మీ నెల చివరిరోజు పేదల గ్యార్మీ పండుగను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. కార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ బొల్లు శ్రీనివాసరెడ్డి, ఆర్ఆర్ రమేష్, మాలిక్, రఫీ, జెండాకట్ట కమిటీ సభ్యులు సాదక్‌వలి, రసూల్, కరీమ్, మాబాషా, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దీపారాధన యోగ సాధనకు గుర్తు


ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

గుంతకల్లురూరల్: కార్తీక మాసంలో చేసే దీపారాధన యోగ సాధనకు గుర్తు అని, కార్తీక మాసంలో రోజూ ఇంట్లో దీపారాధన చేసుకోవడం చాలా మంచిదని త్రైత సిద్ధాంత భగవద్గీత సభ్యులు సూచించారు. ఆదివారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి నాగసముద్రం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రదీప్‌కుమార్‌కు డాక్టరేట్



శింగనమల: శింగనమలకు చెందిన భవనాసి ప్రదీప్‌కుమార్ వైఎస్సార్ జిల్లా యోగివేమన యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆయన ధర్మవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా యోగివేమన యూనివర్శిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ అప్లయిడ్ మ్యాథమ్యాటిక్స్ విభాగంలో (హీట్ ట్రాన్స్‌ఫర్ ఎనాలసిస్ ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ విత్ రేడియేషన్ అండ్ ఎంహెచ్‌డీ) థీసిస్ విజయవంతంగా పూర్తి చేయడంతో నవంబర్ 30న డాక్టరేట్‌తో సత్కరించారు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు ఈలోకానికి వచ్చారన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన


చింతకుంట సమీపంలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని పుట్లూరు చెరువుకు నీరు సరఫరా అయ్యే కాలువలో పూడికతీత పనులను ఆదివారం హెచ్చెల్సీ ఏఈ శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం సుబ్బరాయసాగర్ నుంచి నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో కాలువలో చెట్లు, మట్టి కుప్పలను తొలగించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

పనులు అసంపూర్ణం.. ప్రయాణం నరకప్రాయం


నిలిచిపోయిన బైపాస్ రోడ్డు పనులు

- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


ప్యాచ్ వర్కులు పూర్తి చేయకపోవడంతో దుమ్ము రేగుతున్న దృశ్యం


రోడ్డు డైవర్షన్ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేని దృశ్యం

గుత్తి రూరల్: గుత్తి–గుంతకల్లు జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గుత్తి నుంచి గుంతకల్లుకు అర గంట ప్రయాణం గంట పడుతోంది. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో దుమ్ము రేగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 67వ నంబర్ జాతీయ రహదారి నాలుగు వరుసల రోడ్డుగా మార్చేందుకు 2017లో పనులను ప్రారంభించారు. అయితే రెండేళ్లు పనులు చేసిన అనంతరం కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా చేసి పనులు వదిలి వెళ్లిపోయారు. గుత్తి శివారులోని నాగసముద్రం క్రాస్ నుంచి, కొజ్జేపల్లి, రజాపురం, గుంతకల్లు మండలం గొల్లదొడ్డి వరకూ రోడ్డు డైవర్షన్ చేసి మట్టి రోడ్డు వేశారు. అయితే మట్టి రోడ్డుపై లారీలు, భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము రేగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మట్టి రోడ్డుపై భారీగా గుంతలు పడటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

భయం.. భయం

ఈ రోడ్డుపై కర్ణాటక రాష్ట్రం బళ్లారి, తోర్నగల్లు, హోస్పేట నుంచి భారీ లారీలు తిరుగుతుంటాయి. భారీగా వచ్చే దుమ్ముతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ద్విచక్రవాహనాల పరిస్థితి అయితే మరీ ఘోరంగా ఉంది. భారీగా వచ్చే దుమ్ముతో ద్విచక్రవాహనదారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. రోడ్డు డైవర్షన్‌లు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. గుత్తి పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా తురకపల్లి గ్రామ శివారు నుంచి గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల వరకూ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో గుత్తి పట్టణంలో భారీ వాహనాల రాకతో ప్రతి రోజు ట్రాఫిక్ జామ్ అవుతోంది. వెంటనే జాతీయ రహదారుల అధికారులు స్పందించి రోడ్డు డైవర్షన్‌ల వద్ద మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు అధ్వానంగా ఉంది



గుత్తి–గుంతకల్లు మధ్య జాతీయ రహదారి కొన్ని చోట్ల అధ్వాన్నంగా ఉంది. రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొజ్జేపల్లి, రజాపురం, తిమ్మాపురం దగ్గర రోడ్డుపై మట్టి తేలి దుమ్ముతో ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి డైవర్షన్‌ల దగ్గర త్వరగా పనులు ప్రారంభించాలి.

– రమేష్, వైటీ.చెరువు, గుంతకల్లు మండలం

నిత్యం ప్రమాదాలు



గుత్తి నుంచి గుంతకల్లు వరకూ పలు చోట్ల రోడ్డు గుంతలమయమై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై పలు చోట్ల డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళ్లి మట్టి కుప్పలను ఢీకొని తీవ్రంగా గాయపడుతున్నారు. పలువురు మృత్యువాత పడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీ జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేయించాలి.

– సురేంద్రబాబు, గుత్తి

కాశీ విశ్వేశ్వరుడికి భస్మాభిషేకం


భస్మాభిషేకం చేస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలోని కాశీ విశ్వేశ్వరుడికి ఆదివారం సాయంత్రం ప్రదోశ కాలంలో భస్మాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్తీక అమావాస్య సందర్భంగా ఆలయంలో వెనుక భాగం వైపు ప్రతిష్ఠించిన కాశీ విశ్వేశ్వరుడికి రాత్రి 7గంటల సమయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తుల శివ నామస్మరణల మధ్య భస్మాభిషేకం చేశారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులతో పాటు, అయ్యప్ప, శివ మాలాధారులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం లోఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం,ఆకుపూజా,అర్చనలు,మహానైవేద్యం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శివాలయాల్లో పూజలు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శివాలయాల్లో ఆదివారం కార్తీక అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, అయ్యప్ప ఆలయం, గౌతమేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అశ్వర్థంలో భక్తజన సందోహం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపాన వెలసిన అశ్వత్థ నారాయణుడు క్షేత్రానికి ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులు నారాయణస్వామి, సింగరబట్లు, గణపతి, ఆంజనేయ, శ్రీకృష్ణార్జునులు, సీతారాములు, నవగ్రహాలతో పాటు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ సుబ్రమణ్యం సౌకర్యాలు కల్పించారు.

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నేడు నిరసన

గుంతకల్లుటౌన్: ఇంధన సర్దుబాటు పేరిట విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సోమవారం ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి


పరుగు పందెంలో రాణించిన అక్కా చెల్లెళ్లను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమాండెంట్ మురళీకృష్ణ ఆకాంక్షించారు. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన వర్షిత అండర్–14 విభాగంలో 600 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిగా, అండర్–17 విభాగంలో ఇంద్రలేఖ 4 ఇంటు 100 మీటర్ల విభాగంలో రెండవ స్థానంలో నిలిచింది. దీంతో ఇరువురిని మారిన్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ సాధారణ ఆటోడ్రైవరు పార్థసారధి కుమార్తెలు పరుగు పందెంలో రాణించడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి రాణించి తల్లిదండ్రులతోపాటు గుంతకల్లుకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్‌లో రాణించిన వర్షిత, ఇంద్రలేఖకు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో డీఎం వెంకటేశ్వర్లు, మారిన్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రామాంజినేయులు (ఆంజి) నాయకులు పురుషోత్తం, ఆర్‌హెచ్‌ఎం కాశీనాథ్, కౌన్సిలర్ గుడ్ ఫిటింగ్ ఆంజినేయులు, ఈఓ రాముడు, చలపతి, రమేష్, యోగానంద్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి


గుత్తిలో ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గుంతకల్లులో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సుజాత

గుత్తి/గుంతకల్లు టౌన్/గార్లదిన్నె/తాడిపత్రి అర్బన్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి, హ్యాండ్స్ మేనేజర్ రమేష్ సూచించారు. గుత్తిలో మండల న్యాయ సేవా సమితి, హ్యాండ్స్, ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆదివారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, హ్యాండ్స్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, నర్సులు స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగించారు. ఎయిడ్స్‌ను సమాజం నుంచి తరిమేద్దాం, ఎయిడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు టైపిస్ట్ సాదిక్ వలి, పారా లీగల్ వలంటీర్ నరసింహనాయుడు, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే గుంతకల్లులో ఎయిడ్స్ దినం పురస్కరించుకుని ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుజాత, మైత్రీ సంఘం ప్రాజెక్టు మేనేజర్ రమేష్, పీడీ నూర్జహాన్, డీఎస్ఆర్‌సీ, పీపీటీసీ కౌన్సిలర్స్ హీరానాయక్, సుమలత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గార్లదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచఎయిడ్స్ దినోత్సవంపై వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్‌గౌతమి, సీహెచ్ఓ లోకనాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వ రయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలో ఐసీటీసీ, మాస్ ఎడ్యుకేషన్, ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని వైద్యాధికారి యస్దాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశా వర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, ప్రాజెక్టు మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తాడిపత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

‘రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి’

పామిడి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని హాస్టల్‌లో ఆదివారం హరిత దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఇటీవల గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్‌లో హైవే నెంబర్–44పై జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి చెందడంపై శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.20లక్షల చొప్పున ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే క్షతగాత్రులకు తక్షణసాయం కింద రూ.5లక్షలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సమితి సభ్యులు, రమేష్, రాజు, శ్రీనివాస్, రామ్, రామకృష్ణ, అంజి, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాల అనుమతి రద్దు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి ప్రాంతంలో కల్లు దుకాణాల అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని స్థానిక నెహ్రూ పార్కులో సీపీఐ నాయకులతో కలసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంతో ఈత చెట్ల వనం లేకున్నా. అధికారులు కల్లు దుకాణాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. అధికారులు లంచాలకు అలవాటు పడి విచ్చలవిడిగా కల్లు దుకాణాలకు అనుమతులు ఇస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాడమాడుతున్నారని ఆరోపించారు. కల్లులో మత్తు పదార్థాలు కలుపుతూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణాధ్యక్షులు రమణ, ఉమాగౌడ్, నాయకులు శ్రీను, రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’

యల్లనూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరవుతున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

వసతులు కల్పించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శివారు ప్రాంతాలైన జగ్జీవన్‌రామ్ కాలనీ, భీమిరెడ్డి కాలనీ, నేసేకాలనీ, గుజిరీ కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయా కాలనీలకు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల్లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి శివారు ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

యాడికి: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నంద్యాల నారాయణ శనివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

గుత్తి: రైల్వే సంఘాల గుర్తింపు ఎన్నికలకు సంబంధించి గుత్తిలో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు చెప్పారు. మొత్తం 1,860 మంది ఓటర్లు ఉన్నారు. మూడు బూత్‌లలో ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. ప్రధాన పోటీ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాస్ సంఘ్ మధ్య జరగనుంది. కాగా ఎన్నికలకు సంబంధించిన పట్టణంలో ఫ్లెక్సీలు వెలిశాయి. మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు.

కుర్చీల వితరణ

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాయనపల్లి క్రాస్ సమీపంలోని కాశిరెడ్డి నాయన నిత్యాన్నదాన సత్రానికి 30 కుర్చీలు వితరణ చేశారు. ఆదివారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సభ్యులు కుర్చీలను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రఫీ, సభ్యులు నవీన్, ప్రతాప్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, రమేష్‌బాబు, రంగప్ప, భరత్, రామయ్య, ప్రవీణ్, సత్యప్రసాద్‌రెడ్డి, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్‌లో శని, ఆదివారాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో అండర్–10 బాయ్స్, అండర్–12 గర్ల్స్ విభాగంలో లీగ్ రూరల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గుంతకల్లు, అనంతపురం, తాడిపత్రి, బుక్కరాయసముద్రం, గుత్తికి చెందిన జట్లు పోటీ పడనున్నాయి. ముఖ్యఅతిథిగా హైస్కూల్ హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఆర్డీటీ మండల కోచ్ మాట్లాడుతూ లీగ దశలో ఒక్కో టీమ్ మూడు మ్యాచ్‌లు ఆడుతాయన్నారు. పోటీల్లో రాణించిన జట్లు క్వాటర్స్ ఫైనల్‌కు ఎంపికవుతాయన్నారు.

సంక్షిప్త వార్తలు

రెండిళ్లల్లో చోరీ

తాడిపత్రి రూరల్: మండలంలోని పులిప్రొద్దుటూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు పడి రెండిళ్లల్లో చోరీ చేశారని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పక్రుద్దీన్ కుటుంబం ఎల్లార్తికి వెళ్లగా, సంగప్ప కుటుంబం గ్రామంలోని మరో ఇంటిలో నిద్రించగా దొంగలు పడి నాలుగు కమ్మలు (రెండు తులాలు) ఎత్తుకెళ్లారన్నారు. విషయం తెలిసిన వెంటనే గ్రామానికి వెళ్లి ఇళ్లను పరిశీలించామన్నారు. దొంగతం గురించి సంగప్ప కుటుంబాన్ని విచారించామన్నారు. పక్రుద్దీన్ కుటుంబానికి సమాచారం అందించామన్నారు. వారు వచ్చిన వెంటనే దొంగతనంపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

ఎంపీటీసీ సభ్యురాలికి గాయాలు

యాడికి: మండలంలోని పచ్చారుమేకల పల్లి రహదారిలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎంపీటీసీ సభ్యురాలు గాయపడింది. వివరాలు.. మండలంలోని చందన ఎంపీటీసీ సభ్యురాలు రాగుల పార్వతి, వెంకటరామిరెడ్డి దంపతులు ద్విచ్రవాహనంలో యాడికికి బయలుదేరారు. పచ్చారుమేకల పల్లి రహదారిలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో రాగుల పార్వతి తలకు తీవ్ర గాయం కావటంతో రాయలచెరువుకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో ఆటోలో నుంచి జారి కింద పడి శ్రీరాములు అనే వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు..రాయలచెరువుకు చెందిన ఆయన పని మీద గుత్తికి వచ్చాడు. అనంతరం రాయలచెరువుకు వెళ్తూ వెనుక వైపు కూర్చున్న అతడు ఆటో కుదుపుకు జారి కింద పడి గాయపడ్డాడు. ఆటో డ్రైవర్ అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

25 గొర్రెల అపహరణ

యాడికి: గుర్తు తెలియని వ్యక్తులు 25 గొర్రెలు ఎత్తుకెళ్లారని కాపరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మండలంలోని పుప్పాలకు చెందిన రైతు హరి పొలంలో గత నెల 29న రాత్రి అశోక్, మునీంద్ర, భాస్కర్, చిన్న రంగస్వామి గొర్రెలు ఉంచారు. అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 24 గొర్రెలు, ఒక పొట్టేలును ఎత్తుకెళ్లారు. రూ.3 లక్షల వరకూ నష్టం జరిగిందని బాధిత గొర్రెల కాపరులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: స్థానిక నందలపాడుకు చెందిన చాకలి ఎల్లప్ప (47) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఆయన జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.